
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
బుధవారం 27 నవంబరు 2024
జిల్లాల వార్తలు



ఎంపీపీలుగా చౌటకూర్, నిజాంపేట

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పుల్‌కల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఏర్పడిన చౌటకూర్, నిజాంపేట రెవెన్యూ మండలాలను మండల ప్రజా పరిషత్‌లుగా ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఈమేరకు జీవో ఎం.ఎస్ నంబర్ 67 జారీచేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రెండు మండలాల ప్రజల ఐదేళ్ల నిరీక్షణ ఫలించింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంజీరా నదిలో దూకి

తల్లీకొడుకు ఆత్మహత్య



వడ్ల శ్యామ్ (ఫైల్)

జోగిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో దూకి తల్లీకొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి జరిగింది. సంగారెడ్డి జిల్లా అందోలు మండలం చింతకుంటకు చెందిన వడ్ల బాలమణి (48), ఆమె కుమారుడు వడ్ల శ్యామ్ (28) మంగళవారం రాత్రి బైక్‌పై చింతకుంట శివారులోని మంజీర నది బ్రిడ్జిపైకి వచ్చారు. బైక్‌ను, తన చెప్పులను అక్కడే వదిలి నదిలోకి దూకారు. వారు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరడం, బ్రిడ్జి మీదకు వచ్చి- అక్కడి నుంచి దూకడం కొందరు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే, వారు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు అన్న విషయం మాత్రం తెలియరాలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చినా.. రాత్రి కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేకపోయారు.

పిట్టలవాడపై

నివేదిక కోరిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం దండుపల్లి పంచాయతీ పరిధిలోని పిట్టలవాడవాసుల కుల నిర్ధారణపై సమగ్ర నివేదిక సమర్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సోమవారం 'మా కులమేది..!' శీర్షికతో పిట్టలవాడవాసుల వెతలపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కుల ధ్రువీకరణ పత్రాలు చేయకపోవడంతో చదువుకు, ఉద్యోగాలకు, సంక్షేమ పథకాలు దూరమతున్న దుస్థితిని ఈ కథనం ద్వారా తెలుకున్న కలెక్టర్ సమగ్ర నివేదికను అందజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గతంలో జరిగిన సర్వేలు, రిపోర్టులతో నివేదిక తయారు చేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నిర్మలా జగ్గారెడ్డి

రూ.50 లక్షలు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి



మల్కాపూర్-రాజంపేట రహదారిపై కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 13వ వార్డులో మల్కాపూర్-రాజంపేట రోడ్డులో నిర్మించ తలపెట్టిన కల్వర్టు పనులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కల్వర్టు నిర్మాణం కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.50 లక్షలు మంజూరు చేయించారు. రాజంపేట నుంచి మల్కాపూర్ వెళ్లే రహదారిపై రామచంద్రారెడ్డినగర్ కాలనీ సమీపంలో ఈ కల్వర్టును నిర్మించనున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎర్రకుంట నిండిపోవడంతో ఇళ్లల్లోకి నీరు చేరడంతో మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి చెరువును సందర్శించిన విషయం తెలిసిందే. కుంటలోని నీరు దిగువకు సులభంగా వెళ్లేందుకు ఈ కల్వర్టును నిర్మిస్తున్నారు. కల్వర్టు



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించినందుకు ఆయా కాలనీల ప్రజలు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి నిర్మలారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు లావణ్య ప్రభుగౌడ్, షఫీ, సోహైల్, నవత్ నాగరాజు, జగ్గరి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓ డిపోలో తయారు చేస్తున్న కల్లు

కల్లు కాదు..

కాలకూటం

చెట్ల నుంచి వచ్చేది కొంతే..

మత్తు పదార్థాలు కలిపి వేల లీటర్లుగా మార్చి విక్రయం

- ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారుల దందా
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- సంగారెడ్డి జిల్లాలో జోరుగా కల్తీ కల్లు విక్రయాలు
- ఇప్పటి వరకు 13 అల్ప్రాజోలం కేసులు నమోదు..
- రూ.3 కోట్ల విలువైన సరుకు స్వాధీనం

పగలంతా కష్టపడి పనిచేసిన శ్రమజీవి సాయంత్రం పూట అలసట మరిచి సేదతీరడానికి కల్లు తాగితే.. అది వారి పాలిట కాలకూటంగా మారుతున్నది. కల్లు పేరిట ప్రమాదకర రసాయనాలు కలిపి విక్రయిస్తుండడంతో తాగినవారు దానికి బానిసలుగా మారుతున్నారు. తప్పనిసరై కొద్దిరోజులు కల్లు తాగలేకపోతే మతిస్థిమితం లేనట్టు వ్యవహరిస్తున్నారు. నిరుపేదల బలహీనతను ఆసరాగా చేసుకుని కొంతమంది కల్తీ కల్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కల్తీ కల్లు అమ్మేవారు కోట్లకు పడగలెత్తుతుండగా.. తాగిన పేదలు మాత్రం రోగాలబారినపడుతున్నారు.

సంగారెడ్డి క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. చెట్ల నుంచి వచ్చేది కొంతే అయినా.. ప్రమాదకర రసాయనాలు కలిపి దానిని వేల లీటర్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రజలను మత్తులో ముంచేందుకు కల్లులో అల్ప్రాజోలం, డైజోఫామ్, క్లోరల్‌హైడ్రేడ్ వంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను ఉపయోగిస్తున్నారు. గతంలో కల్తీ కల్లు తయారీలో వ్యాపారులు డైజోఫామ్, క్లోరోహైడ్రేడ్ లాంటి మత్తు పదార్థాలను వినియోగించేవారు. కానీ వీటి లభ్యత తగ్గడం, ధర ఎక్కువగా ఉండడంతో అల్ప్రాజోలం అనే మత్తుమందును ఉపయోగించి కల్లును తయారు చేస్తునట్టు తెలుస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో ఈత, తాటి చెట్లు తక్కువగా ఉంటాయి. చెట్ల నుంచి తీసిన కొద్దిపాటి కల్లులో నీళ్ల పోసి, మత్తుమందు కలిపి, తియ్యదనం కోసం షక్రిన్ పౌడర్, పులుపు కోసం ఈస్ట్, నురుగ కోసం కుంకుడుకాయల రసం కలిపి వేల లీటర్ల కల్లును తయారు చేస్తున్నారు. అనంతరం కల్లు దుకాణాలకు తరలించి విక్రయిస్తున్నారు. జిల్లాలో అల్ప్రాజోలం పట్టుబడిన సంఘటనలు ఇటీవల తరచుగా బయటపడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 13 కేసుల్లో పోలీసులు 3 కిలోల వరకు ఈ మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3 కోట్ల వరకు ఉంటుందని పోలీసుశాఖ అధికారులు తెలిపారు.

మురికి నీళ్లు.. పాకురుపట్టిన ట్యాంకులు

జిల్లాలోని మొత్తం 39 కల్లు డిపోలు, 400 కల్లు దుకాణాలు ఉన్నాయి. కల్లు డిపోల్లో అపరిశుభ్రమైన వాతావరణంలో కల్లును తయారు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కల్లు తయారీకి శుద్ధిచేసిన నీటిని వినియోగించాల్సి ఉన్నప్పటికీ బోరు నీటినే వాడుతున్నారు. నెలల తరబడి శుభ్రం చేయని ట్యాంకుల్లో నీటిని నింపి

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి మండలానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఇటీవల హైదరాబాద్ నగర శివారుకు బదిలీ అయ్యింది. భార్యా పిల్లలతో కలిసి నగరానికి మకాం మర్చాడు. తల్లిని ఒంటరిగా పల్లెటూళ్లో ఉంచడం ఇష్టం లేక తమ వెంట నగరానికి తీసుకెళ్లాడు. వారం రోజుల అనంతరం తల్లి ఆరోగ్యం క్షీణించింది. మతిస్థిమితం కోల్పోయినట్టు ప్రవర్తించసాగింది. చికిత్స నిమిత్తం ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించాడు. నెల రోజులైనప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోగా మరింత క్షీణించింది. ఏ అనారోగ్యం ఉందో వైద్యులు గుర్తించలేకపోయారు. ఆమెకు కల్లుతాగే అలవాటు ఉందని తెలుసుకున్న వైద్యులు ఊరి నుంచి ఆమె రోజూ తాగే కల్లు తెప్పించి తాగించండని సలహా ఇచ్చారు. సంగారెడ్డి నుంచి కల్లు తెప్పించిన అనంతరం ఉద్యోగి తల్లి కొద్ది గంటల్లోనే కుదుటపడి ఆమె లేచి కూర్చుని స్థిమితంలోకి వచ్చింది. కల్లులోని మత్తుకు అలవాటు పడిన ఆమె ఒక్కసారిగా మానేయడంతోనే ఆరోగ్యం క్షీణించిందని వైద్యులు తేల్చేసి ఇంటికి పంపించారు.

సంగారెడ్డి పట్టణానికి చెందిన ఓ కార్మికుడికి నిత్యం కల్లు తాగే అలవాటుంది. ప్రతీరోజు కల్లు తాగి ఇంట్లో గొడవ చేస్తుండేవాడు. ఇటీవల కుటుంబ సభ్యులు అలవాటును మాన్పించడం కోసం ఇంట్లోంచి బయటకు రాకుండా కట్టడి చేశారు. వారం రోజులు కల్లు తాగకపోవడంతో అయన మతిస్థిమితం కోల్పోయినట్టు ప్రవర్తించడం ప్రారంభించాడు. గోడలపై గీయడం, పిచ్చి పిచ్చిగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆసుపత్రిలో చూపించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆయన అలవాటు గురించి తెలుసుకున్న వైద్యులు కల్తీ కల్లుకు అలవాటుపడిన ఆయన.. కల్లు దొరక్కపోవడంతోనే ఇలా అయ్యాడని తేల్చిచెప్పారు. కల్లు తెప్పించి తాగించడంతో మామూలు మనిషయ్యాడు.

.. వీరిద్దరే కాదు సంగారెడ్డి జిల్లాలో కల్తీ కల్లుకు అలవాటు పడిన ఘటనలు తరచుగా బయటపడుతున్నాయి.



సంగారెడ్డిలోని ఓ డిపోలో పాకురుపట్టిన కల్లు ట్యాంకు

గ్రామీణ రహదారుల

రూపురేఖలు మారుస్తాం

బీఆర్ఎస్ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయి

ప్రాధాన్యత క్రమంలో పునరుద్ధరిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



రోళ్లపహాడ్ గ్రామంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట/పుల్‌కల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రంలో కనీస మరమ్మతులు లేక రోడ్లు అధ్వానంగా మారాయన్ని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం పునర్ నిర్మిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చెప్పారు. అందోల్ నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, చౌటకూర్ మండలాల్లో రూ.30 కోట్లతో చేపట్టనున్న గ్రామీణ రోడ్ల పునర్ నిర్మాణ పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే పూర్తి కావొచ్చిందని, త్వరలోనే నివేదిక ప్రభుత్వానికి అందనున్నదన్నారు. చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులందరికీ స్వెటర్లు, బ్లాంకెట్ల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు కాస్మొటిక్స్, మెస్ ఛార్జీలను పెంచిన ఘనత రేవంత్ సర్కార్‌దే నన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా కూడా చర్యలు చేపట్టామన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, చౌటకూరు మండలాల్లోని పలు రోడ్ల పనులను మంత్రి ప్రారంభించారు. పుల్కల్ మండలంలోని కోడూరు ఎక్స్ రోడ్డు నుంచి అందోలు మండలం కొండారెడ్డిపల్లి వరకు, అందోలు మండలం డాకూరు నుంచి మాసానిపల్లి మీదుగా, పోతిరెడ్డిపల్లి వరకు, జోగిపేట-టేక్మాల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రోళ్లపహాడ్ గ్రామానికి అప్రోచ్ రోడ్డు పనులను మంత్రి దామోదర్ ప్రారంభించారు. అనంతరం అందోలు పట్టణంలోని శ్రీరంగనాథ ఆలయంలో ద్విసహస్ర దీపోత్సవాన్ని ప్రారంభించారు. అందోలు మండలంలో జరిగిన కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, పట్లోల్ల సంగమేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అశోక్, జీఆర్ నరేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పుల్కల్ మండల పరిధిలో మల్లన్నగారి దుర్గారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, యాదగిరి, మహేశ్, శ్రీనివాస్‌ముదిరాజ్, ఉదయ్‌కుమార్, గణపతి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



కంది సాగు ఆశాజనకం

- ఝరాసంగంలో 4 వేల ఎకరాల్లో సాగు
- క్వింటాలుకు రూ.7,550 ధర
- కాత, పూత దశలో పంట
- రైతులను భయపెడుతున్న పచ్చ పురుగు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

7

చలికాలం

చేద్దాం వ్యాయామం

- మెరుగైన ఆరోగ్యానికి తప్పనిసరంటున్న వైద్యులు

7



కోహీర్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తున్న విద్యార్థులు

శాసనమండలి ఎన్నికల

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- డిసెంబరు 9 వరకు నమోదుకు అవకాశం
- 25న అభ్యంతరాల పరిష్కారం
- 30న తుది జాబితా విడుదల

మెదక్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల గడువు 2025 మార్చితో ముగుస్తోంది. తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్ల నమోదుకు నవంబరు 6వ తేది వరకూ ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఓటరు జాబితా ముసాయిదా ప్రకటించారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9వరకు స్వీకరిస్తున్నారు. 25వ తేదీ లోగా అభ్యంతరాలను పరిష్కరించి అదే నెల 30న తుది జాబితా ప్రకటించనున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 11,031 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 7,945 మంది, 3,086 మంది మహిళలు ఉన్నారు. ఉపాధ్యాయులు 1,102 మంది కూడా ఓటు నమోదు చేసుకున్నారు. ఇందులో 709 మంది పురుషులు, 393 మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రాడ్యుయేట్లు 80వేల వరకు ఉండవచ్చని అంచనా. అయినా ఓటరు నమోదుకు ఆసక్తి కనబర్చకపోవడం గమనార్హం. ఉపాధ్యాయులు కూడా ఓటరు నమోదుకు ముందుకు రాకపోవడం గమనార్హం. దీంతో, ఓటరు నమోదుకు వచ్చే నెల 9వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఎన్నికల నిర్వహన కోసం అధికారలు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 21 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు.



సీతానగర్‌లో వడ్లు కొనుగోలు చేస్తున్న వ్యాపారి

అన్నదాతల కష్టం

దళారుల పాలు..

- కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- అన్నదాతకు అందని గిట్టుబాటుధర
- సీతానగర్‌లో తీరని వెతలు

అల్లాదుర్గం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే.. నిర్వాహకులు, మిల్లర్లు పెడుతున్న కొర్రీలతో రైతులు విసిగిపోతున్నారు. సాగు కోసం తెచ్చిన అప్పుల వడ్డీ పెరిగిపోతుండడంతో తప్పనిసరై దళారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని సీతానగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు తీరడం లేదు. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో రైతుల కష్టం దళారుల పాలవుతున్నది. గ్రామంలో నెల రోజుల క్రితం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా.. మూడు వారాలు ఆలస్యంగా తూకం ప్రారంభించారు. రెండు, మూడు రోజులకే మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో తూకం నిలిచిపోయింది. దీంతో రైతులు కేంద్రం వద్ద ఆందోళన చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఐదు రోజుల క్రితం 161 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మండలస్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించినా సమస్యలు మాత్రం తీరలేదని రైతులు వాపోతున్నారు. ఇదే అదునుగా కొందరు దళారులు స్పాట్‌లోనే డబ్బు ఇస్తామని ఆశ చూపి వడ్లు

మిగతా 8వ పేజీలో

నష్టమని తెలిసినా తప్పక విక్రయిస్తున్నాం



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విపరీతమైన ఆలస్యం జరుగుతున్నది. అన్ని రోజులు వేచిచూసి వడ్లు తూకం చేయిస్తే మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. పంట సాగు కోసం తీసుకువచ్చిన అప్పులు తీర్చమని ఒత్తిడి పెరగడంతో చేసేదేమీలేక ధర తక్కువైనా వ్యాపారులకు విక్రయిస్తున్నాం.

-నడికుట్ల భాగయ్య, ముప్పారం



కోహీర్‌లో ఉదయం పూట వ్యాయామం చేస్తున్న యువకులు

చలికాలం.. చేద్దాం వ్యాయామం

● ఆరోగ్యానికి వ్యాయామం, పోషకాహారం తప్పనిసరంటున్న వైద్యులు

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చలిక సాకుతో ఉదయం వేళ ఆలస్యంగా నిద్రలేస్తూ చాలా మంది వ్యాయామం చేయరు. ఇలా చేయడం ఆరోగ్యానికి ఏ మాత్రం సరికాదని నిపుణులు అంటున్నారు. ఏ కాలంలోనైనా తగిన శారీరక శ్రమ ఉంటేనే బద్ధకం తగ్గి ఒంట్లో చురుకుదనం పెరుగుతుందంటున్నారు. ఎముకలు పటిష్టతకు, చలికాలంలో బిగుసుకుపోయే కీళ్లు మామూలుగా తయారవ్వాలన్నా నిత్యం వ్యాయామం చేయాలని చెబుతున్నారు. కొన్ని గంటలపాటు కదలకుండా కూర్చుని ఉద్యోగం చేసే వాళ్లు గంటకోసారి లేచి ఐదునిమిషాల పాటు నడవాలని, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ముఖ్యంగా విటమిన్ డీ కోసం నిత్యం ఉదయం వేళ సూర్యరశ్మి శరీరానికి తగేలా చూసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, చేపలు తరచూ తినాలంటున్నారు.



రోడ్డు పక్కన వ్యాయామం చేస్తున్న యువత

చిరుధాన్యాలను తీసుకోవాలి..

చలి సాకుతో స్నానం మానేయడం అనారోగ్యానికి కారణం అవుతుంది. రెండు పూటలా స్నానం చేయడం, తగినంత తాగునీరు తీసుకోవడం చలికాలంలోనూ అవసరమే. రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు, వంటి చిరుధాన్యాలు వినియోగంతో శరీరానికి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, జింకు, భాస్వరం, ప్రోటీన్లు, పీచు, కొవ్వు పదార్థాలు, లవణాలు తగినంతగా అందుతాయి. చిరుధాన్యాలను విరివిగా తీసుకుంటే మధుమేహం, రక్తహీనత, నేత్రవ్యాధులు, మలబద్ధకం, కీళ్లనొప్పులు, నరాల బలహీనత, రుతుస్రావ సమస్యలు రాకుండా ఉంటాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే అధిక రక్తపోటు, అల్సర్లు, కిడ్నీల్లో రాళ్లు, జీర్ణక్రియ, ఎముకల పట్టుత్వం, రోగనిరోధక శక్తి వృద్ధికి చిరుధాన్యాలు ఎంతో మేలు చేస్తాయి.

వాకింగ్‌తో ఆరోగ్యానికి మేలు



చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల శరీరం ఎంతో చురుకుదనంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వాకింగ్ వెళ్తాం. దీంతో రోజంతా హుషారుగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలి.

- రాజ్‌కుమార్, స్థానికుడు

వ్యాయామం అవసరం



చలికాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఈ కాలంలో శరీరంలోని అవయవాలు బిగుసుపోయి నొప్పులు వస్తాయి. వీటిని నివారించేందుకు ప్రతిరోజూ ఉదయం వ్యాయామం చేయాలి.

-అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు

పోషకాహారం తీసుకోవాలి



చలికాలంలో ఎముకల పటిష్టతకు డి-విటమిన్ గల పదార్థాలు తరచూ తీసుకోవాలి. అలాగే ఉదయం వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత తప్పనిసరిగా పాలు, గుడ్లు తీసుకోవాలి.

-నవీన్‌కుమార్, వైద్యుడు

రూ.50 కోట్లతో నల్లవాగు ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ

● రూ.90 కోట్లతో మంజీరా నుంచి వరద కాలువ పనులకు ప్రతిపాదనలు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని, వారంరోజుల్లో ఈ పనులు మంజూరవుతాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో అభివృద్ధి పనులకు, సీఆర్ఆర్ పథకం కింద రూ.1.79 కోట్లతో మంజూరైన గోసాయిపల్లి రహదారికి, మండల కేంద్రమైన కల్హేర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన సీసీ రహదారుల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కల్హేర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన 13 గ్రామాలకు సాగునీరు అందిస్తున్న నల్లవాగు ప్రాజెక్టు పరిధిలోని 11 కిలోమీటర్ల ఎడమ, కుడి కాలువలకు మిగిలిన 4 కిలోమీటర్ల కాలువల ఆధునీకరణకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని, వారంరోజుల్లో ఈ పనులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నల్లవాగు ప్రాజెక్టులో ఎప్పటికీ సాగునీరు అందుబాటులో ఉంచేవిధంగా సింగూరు బ్యాక్ వాటర్‌లో ఉన్న మంజీరానది నుంచి కాలువ తవ్వే పనులకు రూ.90 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని బీటీ రహదారుల అనుసంధానం కోసం రూ.15 కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, మాజీ ఎంపీపీ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోచయ్య నాయకులు యాదవరెడ్డి, వినోద్‌పాటిల్, దేవదాస్, వీరశెట్టి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

● సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ



విద్యార్థిని జయహాసినిని అభినందిస్తున్న సీపీ అనురాధ

గజ్వేల్/సిద్దిపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు సదరు రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ ఆకాంక్షించారు. గజ్వేల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సంతోష్‌కుమార్ కుమార్తె జయహాసిని ఎస్‌జీఎఫ్ అండర్-14 జాతీయస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికవగా, మంగళవారం సీపీ అనురాధ జయహాసినిని సన్మానించారు. దేశస్థాయిలో రాణించి, మొదటిస్థానంలో నిలిచి తెలంగాణ, పోలీస్ శాఖ పేరును నిలబెట్టాలని ఆమె ఆకాంక్షించారు. ఆమె వెంట అదనపు సీపీ మల్లారెడ్డి, ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మధు, రవిందర్, సంతోష్‌కుమార్, గజ్వేల్ సీఐ సైదా తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: డీఈవో

మాసాయిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మెదక్ డీఈవో రాధాకిషన్‌రావు, టీపీసీసీ కార్యదర్శి ఆవుల ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మాసాయిపేట మండలంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కాగా సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు మొదటి, మెదక్ జిల్లా జట్టు రెండో, మంచిర్యాల జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఈ జట్లకు వారు బహుమతులు అందజేశారు.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.9.60 లక్షలు

పాపన్నపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.9.60 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం ఆలయ కార్యాలయంలో ఈవో చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు పలు వ్యాపారాలకు సంబంధించిన వేలం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు వినోదం, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు వేలం వేయగా రూ.9.60 లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.49 వేలు అదనంగా ఆదాయం వచ్చింది. ఆలయం వద్ద కొబ్బరికాయల అమ్మకం, ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు, ఆలయం వద్ద పూజ సామగ్రి విక్రయించుకునేందుకు వేలం వేయగా.. గతేడాది కంటే తక్కువ పలకడంతో వేలాన్ని వాయిదా వేశారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు, చెప్పుల స్టాండు నిర్వహణ కోసం వేలం వేయగా ఎవరూ లేకపోవడంతో వాయిదా వేశారు. తలనీలాలు పోగు చేసుకునే వేలాన్నీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. వాయిదా వేసిన టెండర్లను త్వరలో నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, తదితరులున్నారు.

సంగారెడ్డిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు అనిల్‌చారి, ఎపీవో సంతోష్‌కుమార్, నందకుమార్, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో శ్రామికవర్గం భవిష్యత్ ఆందోళనకరం

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ● కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ధర్నా

పటాన్‌చెరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలతో దేశంలో శ్రామిక భవిష్యత్ ఆందోళనకంగా మారిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యకుడు నర్సింహారెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపిన ప్రధాని మోదీ శ్రామికవర్గాన్ని నిర్వీర్యం చేసేవిధంగా కార్మిక చట్టాల్లో సంస్కరణలకు ఆజ్యం పోశారన్నారు. అంబానీ, అదానీల కోసమే తెరవెనక చక్రం తిప్పుతున్న బీజేపీ పెద్దల బండారం బట్టబయలైందన్నారు. సహజ వనరులపై పెట్టుబడిదారులకు గుత్తాధిపత్యం కట్టబెడుతూ సామాన్య ప్రజలకు మాత్రం నిత్యావసరాలు అందుబాటులో లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 29 చట్టాలుగా కుదించి 4 కోడ్లుగా విభజించడం వెనక ఉన్న కుట్రలు బహిర్గతమయ్యాయని చెప్పారు. చివరికి వ్యవసాయంలోకి సైతం కార్పొరేట్ చొరబడి రైతులను నిర్వీర్యం చేసే కుట్రలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ ఆందోళనలో ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రమౌళి, విజయ్‌రాజు, అమర్‌యాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటరాజ్యం, శివశంకర్ పాల్గొన్నారు.



పటాన్‌చెరులో ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట/హవేళిఘణపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శానాయిపల్లి గేటు నుంచి ఎల్లాపూర్ గ్రామం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.1.50 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజా పాలనను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. అంతకుముందు నాగ్సాన్‌పల్లి, అబ్లాపూర్ గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నర్సింహులుగుప్తా, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మెదక్ నియోజక వర్గంలోని గ్రామాలను అన్నివిధాలు అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. మంగళవారం హవేళిఘణపూర్ మండల కేంద్రంలో రూ.5.40 లక్షలో మంజూరైన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జక్కన్నపేటలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరశురాంగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, రాము, గణేష్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఏదైనా సాధించగలం

● ఎన్‌సీసీ దినోత్సవంలో ప్రొఫెసర్ డీఎస్.రావు ఉద్బోధ



కవాతు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 26 : క్రమశిక్షణతో దేశంలో మనం ఏ మైలురాయినైనా అధిగమించగలమని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు ఉద్బోధించారు. జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ నినాదమైన ఐక్యత, క్రమశిక్షణతో క్యాడెట్లు ప్రతి అంశంలో రాణించగలుగుతారని తెలిపారు. ఈ క్రమశిక్షణ వారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి బలం, ధైర్యం, ఓర్పును అందిస్తాయని చెప్పారు. మనదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు కృషి చేస్తున్నందున, తక్కువ తలసరి ఆదాయం సవాలు పరిష్కరించే దిశగా ఎన్‌సీసీ క్యాడెట్లు తాము సమకూర్చుకున్న జ్ఞానంతో కృషి చేయాలన్నారు. పౌరుల జీవన ప్రమాణాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ క్యాడెట్‌గా తన అనుభవాలు, క్యాంపు, భోజన వసతి సౌకర్యాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకలు ఎన్‌సీసీ జెండా వందనంతో పాటు క్యాడెట్ల కవాతుతో ప్రారంభమయ్యాయి. దీని తర్వాత పర్యావరణ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా మొక్కలను నాటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నేపాల్‌లో జరిగిన ఎన్‌సీసీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (వైఎల్‌పీ)లో పాల్గొన్న గీతం విద్యార్థిని, క్యాడెట్ అండర్ ఆఫీసర్ మహిత కొండూరిని ప్రొఫెసర్ రావు సత్కరించి, ఒక కోటు, మొక్కను అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్ ప్రధాన లక్షణాలను జూనియర్ అండర్ ఆఫీసర్ అబ్దుల్ హదీ షరీఫ్ వివరించగా, క్యాడెట్ సంహిత వందన సమర్పణ చేశారు. ఈ వేడుకల్లో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

● ఝాన్సీలింగాపూర్‌లో ఘటన



దుర్గోళ్ల బాలయ్య (ఫైల్)

రామాయంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన దుర్గోళ్ల బాలయ్య(26) అలియాస్ బాలు కొంతకాలంగా తాగుడుకు అలవాటు పడి అప్పులు చేశాడు. అంతేగాక తరచూ మద్యం సేవించి రావడంతో కుటుంబంలో కలహాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చిన బాలును తల్లిదండ్రులు మందలించగా వారితో గొడవపడి బయటకు గెంటేశాడు. ఆ సమయంలో తన భార్య కూడా ఇంట్లో లేదు. అనంతరం తాగిన మైకంలో ఇంట్లోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తలుపులు ధ్వంసం చేసి.. మహనీయుల చిత్రాలకు రంగులు పూసి..

● శివ్వంపేటలో గుర్తు తెలియని దుండగుల దుశ్చర్య



కలర్ పూసిన సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్

శివ్వంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాల తలుపులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు.. మహనీయుల చిత్రాల మొహాలకు కలర్ పూసి అవమానపరిచారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. శివ్వంపేటలోని ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశాడు. గ్రామానికి చెందిన పులిమామిడి నవీన్‌గుప్తా సుమారు రూ.8 లక్షల సొంత నిధులను వెచ్చించి నిలిచిపోయిన పనులను పూర్తిచేయించారు. మూత్రశాలలు, ప్లంబర్, విద్యుత్ సదుపాయంతో పాటు గోడలకు మహనీయుల చిత్రాలను వేయించి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అన్ని హంగులతో తీర్చిదిద్దారు. కాగా సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పాఠశాల తలుపులను ధ్వంసం చేసి సుభాష్ చంద్రబోస్ చిత్రానికి ముఖంపైన నల్ల కలర్ వేసి అవమానపరిచారు. నూతనంగా ఏర్పాటుచేసిన బోర్డుపై కలర్లు పూశారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ శ్రీనివాస్ పరిశీలించి విచారణ చేపట్టారు.



కొత్త బోర్డుపై నల్ల గీతలు గీసిన దుండగులు

కంది సాగు ఆశాజనకం

● కాత, పూత దశలో పంట

● రైతులను భయపెడుతున్న పురుగు బెడద



ఝరాసంగం మండలం బొరెగావ్ శివారులో సాగుచేసిన కంది పంట

ఝరాసంగం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని బొరెగావ్, నర్సాపూర్, దేవరంపల్లి, సిద్ధాపూర్ తదితర గ్రామాల్లో కంది పంటను అధికంగా సాగుచేశారు. ఈ సంవత్సరం కురిసిన వర్షాలకు తట్టుకొని పంట ఆశాజనకంగా.. పూత, కాత దశలో ఉంది. ఝరాసంగం మండలంలో 4 వేల ఎకరాల్లో కంది సాగవుతోంది. ఉదయం పొగమంచు పడుతుండడంతో కొంతమేర పూత దెబ్బతిని, పచ్చపురుగు బెడద అధికంగా కనిపిస్తోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. సంబంధిత అధికారులు సూచనాలు, సలహాలు ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అంతర పంటగా కంది

ప్రతి ఏడాది రైతులు కందిని అంతర పంటగా సాగుచేస్తారు. ఖరీఫ్‌లో పెసర, మినుము, సోయాబీన్ పంటలతో పాటు కందిని వేస్తారు. మొదట పెసర, మినుము, సోయాబీన్ పంటలు చేతికి వస్తాయి. తరువాత రబీలో కంది పంటను రైతులు కోత చేస్తారు. పెసర, మినుము, సోయా పంట వల్ల భూమి సారవంతంగా మారుతుంది. దీనివల్ల పంటల దిగుబడి అధికంగా వస్తుంది. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో పెసర, మినుము, సోయా పంటల దిగుబడి తగ్గడంతో రైతులు కంది పంటపైన ఆశలు పెట్టుకున్నారు.

పెరిగిన మద్దతు ధర

ప్రభుత్వం కంది పంటకు మద్దతు ధర పెంచింది. గతేడాది ధర రూ.6,300 ఉండగా, ఈసారి రూ.7,550గా ప్రకటించింది. అయితే ఈ సంవత్సరం రూ.1250లు ఎక్కువగా అందజేస్తుంది. పత్తి పంట కంటే కందికే అధిక ధర ఉంది.

పంటకు పచ్చపురుగు బెడద

కంది పంట మొగ్గ, పూత దశలో ఉండడంతో పచ్చపురుగు ఉధృతి అధికంగా ఉంది. దీనికితోడు పొగ మంచు పడడం వల్ల పూత రాలుతుంది. అదేవిధంగా చీడపీడలు బెడద పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సలహాలు, సూచనాలు ఇవ్వాలి

క్లస్టర్‌వారీగా విధులు చేపడుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో పంటను పరిశీలించి ఎలాంటి మందులను పిచికారీ చేయాలనే విషయాలపై సలహాలు ఇవ్వాలి. కానీ రైతువేదికలకే పరిమితం కావడంతో రైతులు ఫర్టిలైజర్ యాజమాన్యం అందజేసిన మందులను పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

పకడ్బందీగా డేటా ఎంట్రీ చేపట్టాలి


డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆపరేటర్లకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే వివరాల నమోదు తీరును ఆయన పరిశీలించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులకు వివరించాలని సూచించారు.

● కొల్చారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతన శెట్టిపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని సత్య సాయి రైస్‌మిల్, కేజీబీవీ పాఠశాలలో వంటగదిని, వంటలను వండే వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి, రైతులకు సత్వరమే వారి అకౌంట్లలో డబ్బు జమ చేయాలన్నారు. ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, కేజీబీవీ పాఠశాల సిబ్బందికి సూచించారు.

అద్దె భవనాల్లో అవస్థలు

- జహీరాబాద్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు
- నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిన వ్యవసాయ, అబ్కారీశాఖల భవనాలు
- ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది


జహీరాబాద్‌లో నిధులలేమితో నిలిచిపోయిన అబ్కారీ కార్యాలయ భవనం

జహీరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు అద్దెభవనాలే దిక్కయ్యాయి. ఏళ్లతరబడి ఇరుకైన గదులతో సరిపెట్టుకుంటూ ఆయా శాఖలకు చెందిన అధికారులు విధుల నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలో ప్రభుత్వ స్థలం బాగానే ఉంది. తమ కార్యాలయాలకు స్థలం కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులు ఉన్నతాధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేని దుస్థితి నెలకొన్నది. జహీరాబాద్ పట్టణంలో ఎక్సైజ్‌శాఖ, కార్మికశాఖ, ఐసీడీఎస్, తదితర కార్యాలయాలు అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, అధికారులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో గత్యంతరం లేక ఇరుకు గదులతో సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయా శాఖల అధికారులు వాపోతున్నారు.

అరకొర నిధులతో అర్ధాంతరంగా పనులు

2021 సంవత్సరంలో ఎక్సైజ్ కార్యాలయ భవననిర్మాణానికిగాను ప్రభుత్వం రూ.40లక్షలను మంజూరు చేసింది. దీంతో భవననిర్మాణం చేపట్టేందుకు అప్పట్లో ముందుకువచ్చిన కాంట్రాక్టర్ 3 స్లాబులు, పిల్లర్లను వేసి చేతులెత్తేశాడని అధికారులు చెబుతున్నారు. పెరిగిన ధరల దృష్ట్యా భవన నిర్మాణానికి ఇచ్చే నిధులు సరిపోడంలేదని అర్ధాంతరంగా భవననిర్మాణం పనులను ఆపేశాడు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టరుకు రూ.10లక్షల మేర చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. గత రెండేళ్లుగా ఎక్సైజ్‌శాఖ భవన నిర్మాణం పనులు అర్ధాంతరంగానే నిలిచిపోయాయి. ఎక్సైజ్‌శాఖ కార్యాలయ భవనంనిర్మాణం పూర్తికావాలంటే సుమారు రూ. కోటి మేరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. వ్యవసాశాఖ భవననిర్మాణానికి గాను 2022 డిసెంబరులో వ్యవసాయశాఖ నుంచి రూ.50లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యవసాయశాఖ భవననిర్మాణ పనులను కాంట్రాక్టరు దాదాపు పూర్తిదశకు తీసుకు వచ్చాడు. ప్రస్తుతం రూ. 20లక్షల నిధులు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయని భావించి అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. దీంతో వ్యవసాయశాఖ భవననిర్మాణం గత ఏడాది కాలంగా నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన ఆయా శాఖలకు చెందిన భవనాలనిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేస్తే సౌకర్యం

జహీరాబాద్ పట్టణంలో వివిధ కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన వ్యవసాయశాఖ కార్యాలయం, అబ్కారీశాఖ భవనం పనులను త్వరిగతిన పూర్తిచేసి వినియోగంలోకి తెస్తే బాగుంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అర్ధాంతరంగా నిలిచిన కార్యాలయాల పనుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రం కావడంతో వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు, అధికారులు, అబ్కారీశాఖ కార్యాలయానికి ప్రజలు తరచూ వస్తుంటారు. ఉన్నతాధికారులు కల్పించుకుని పనులు పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

పర్కిబండ గ్రామాన్ని పరిశీలించిన డీటీ


పర్కిబండ గ్రామంల మురుగు కాలువను పరిశీలిస్తున్న డీటీ కౌశిక

మనోహరాబాద్, నవంబరు 26:(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సర్పంచ్ పదవి కాలం ముగియడంతో 'గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు అధికారులు మంగళవారం పర్కిబండ, గౌతోజీగూడా గ్రామాన్ని స్పెషల్‌ఆఫీసర్ డిప్యూటీ తహసీల్దార్ కౌశిక పరిశీలించారు. గ్రామ కార్యదర్శి నాగరాజుతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తామని, గ్రామంలో మురుగు నీటి కాలువ కోసం నిధులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. నిధుల కొరత వల్లే కార్యదర్శులు పనులు చేయలేదన్నారు.

పంటల సాగుపై ట్రైనీ కలెక్టర్ల ఆరా

కొండాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మల్లేపల్లిలో వివిధ రాష్ట్రాల ట్రైనీ ఐఏఎస్ అధికారులు మంగళవారం రైతుల సాగుపై దృష్టి సారించి సాగు విధానం మొలకువలను అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో చేసే వ్యాపారాలను నేరుగా పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎన్ని రోజులు పని దినాలు, అందే కూలి డబ్బులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య సేవలకు సిబ్బందిని శాలువాలతో ట్రైనీ అధికారులు సన్మానించారు.

ఐకమత్యంతోనే ఆర్థిక స్వావలంబన


కంది: బేగంపేటలో మహిళా సంఘాలకు ఫర్నీచర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కంది/సంగారెడ్డి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఐకమత్యంగా ఉంటేనే ఆర్థిన స్వాలంబన ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కంది మండలం బేగంపేట గ్రామంలో సంఘసేవకులు జంగారి సాయిగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ గ్రామ మహిళా సంఘాల సభ్యులకు రూ.85 వేల ఆర్థిక సాయంతో పాటు కుర్చీలు, ఫర్నిచర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 29న సంగారెడ్డిలో పెద్ద ఎత్తున జరుగనున్న దీక్షా దివస్‌కు జిల్లాలోని పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఖేడ్ ఎమ్మెల్యే


ఖేడ్ మండలం తుర్కపల్లి - కడ్పల్‌రోడ్డునిర్మాణంపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కంగ్టి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పనుల జాతర ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల నెరవేరనుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో రూ.5.80 కోట్ల విలువైన రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కంగ్టి మండలంలోని కంగ్టి, ఘన్‌పూర్,తడ్కల్ తదితర గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లతో పాటు మురికి కాలువల నిర్మాణం పనులను శంకుస్థాపన చేశారు. మన ఊరిలో పనుల జాతరలో భాగంగా ఎమ్మెల్యే నారాయణఖేడ్‌లోని పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో ఆయా గైర్హాజరు ఉండగా 18 మంది విద్యార్థుల పేర్లు నమోదు ఉండగా, కేవలం 8 మంది విద్యార్థులుమాత్రమే హాజరయ్యారు. పలు రికార్డులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కేంద్రం నిర్వాహణపై అసహనం వ్యక్తం చేశారు. టీచర్‌పై చర్యలకు ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో నిజాంపేట్ మండల కేంద్రంలో బేటి బచావో, బేటి పడావో వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలు

మెదక్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 బాల బాలికల క్రీడలు మంగళవారం పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 100 బాల బాలికలు, 30 మంది కోచ్, మేనేజర్లు హాజరయ్యారు. ఈ పోటీలను డీఈవో రాధాకిషన్ ప్రారంభించారు. ఈనెల 28 వరకు పోటీలు జరగనున్నాయి.

బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు

నిజాంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మెదక్ డీఎం సురేఖ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మెదక్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. కాంపౌండ్ వాల్ కోసం రూ.15 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎన్నో ఏళ్ల బస్టాండ్ కల సాకారం కాబోతున్న తరుణంలో పనులు ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెదక్ డిఎం సురేఖ, ఆర్టీసీ సీఐ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంసాన్‌పల్లిలో పశు వైద్య శిబిరం

కొల్చారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) పాడి రైతులు తమ పశువుల పెంపకం పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొల్చారం మండల పశు వైద్యాధికారి డా. వీరేశం సూచించారు. మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ సహకారంతో అంసాన్‌పల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

పండ్ల తోటల పెంపకంతో అధిక దిగుబడి: డీపీవో

టేక్మాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం చేసుకొని పెట్టుబడి లేని దిగుబడి పొందాలని డీపీవో, టేక్మాల్ మండల ప్రత్యేకాధికారి యాదయ్య తెలిపారు. ఉపాధి పనుల జాతర మరియు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కుసంగిలో మామిడి తోటల పెంపకం పనులను ప్రారంభించారు.

ఫిజియో థెరపీపై ఉపాధ్యాయులకు అవగాహన

పెద్దశంకరంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ, ఇతర వ్యాధులను తగ్గించడంపై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులు రమేష్, వెంకట, రాములు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని మండలవనరుల కేంద్రంలో మండలపరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫిజియో థెరపీ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.

మూఢనమ్మకాలపై అవగాహన

మెదక్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతో మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని మెదక్ రూరల్ ఎస్ఐ మురళి పేర్కొన్నారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ రూరల్ పోలీస్ శాఖ మండల పరిధిలోని రాచపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణ, వ్యక్తిత్వ వికాసం, సైన్సు మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి)

రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లలో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి అంబేడ్కర్ చిత్ర పటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతా ప్రబాకర్ బీఆర్. అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుల అర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హాజరై రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. తారా కళాశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పలువురి చేత ప్రతిజ్ఞ చేయించారు. అన్నారం గ్రామ పంచాయతీలో జరిగిన రాజ్యంగ దినోత్సవంలో ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హాజరయ్యారు. పుల్కల్, చౌటకూర్ తహసీల్ కార్యాలయాల్లో తహసీల్దార్లు కృష్ణ, మన్నె కిరణ్‌కుమార్‌లు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలో సమతాసైనిక్‌దళ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

మెదక్ జిల్లాలో..

ప్రజలు దేశ ఫలాలను పూర్తిస్థాయిలో పొందాలంటే బాల్యం నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మెదక్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, గోల్కొండ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ గౌరవ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో విద్యార్థులు సంగీతం, నృత్యం, నాటకం వంటి రూపాల్లో రాజ్యాంగంలో నిక్షిప్తమైన విలువలను సృజనాత్మకంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, మాసాయిపేట మండలంలోని పాఠశాలలు, వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మనోహరాబాద్ మండలంలోని గౌతోజీగూడలో గ్రామ స్పెషల్ ఆఫీసర్, డీటీ కౌశిక, ఏపీవో ఆదినారాయణ, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేగుంట గ్రామ అవరణలో ఈవో నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది, సఫాయి కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. అల్లాదుర్గం తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లయ్యతో పాటు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ మడల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.


మెదక్ కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

కల్లు కాదు.. కాలకూటం

(5వ పేజీ తరువాయి)


వేల లీటర్ల కల్లు తయారీకి చిన్న కవరులో తెచ్చిన కొద్దిపాటి కల్లు, టబ్‌లో తయారు చేసిన కల్లు

కల్లు తయారీకి కావాల్సిన పదార్థాలను కలుపుతున్నారు. కల్లు తయారు చేసే వారు చేతులకు గ్లౌజులు వేసుకోవాలి. సీసాలను ప్రతీరోజు శుభ్రం చేసిన తర్వాతే కల్లును నింపాలి. కానీ ఇవేవీ తయారీదారులు పాటించడం లేదని విమర్శలున్నాయి.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు!

జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం మత్తు నిద్రలో ఉన్నారని ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ నెల వారికి రావాల్సిన మామూళ్లు ఠంచనుగా అందుతుండడంతో మొక్కుబడి చర్యలతోనే సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. అల్ప్రాజోలం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అన్నదాతల కష్టం దళారుల పాలు..

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని ముప్పారం, అప్పాజిపల్లి, నీలకంఠపల్లి తదితర గ్రామాల్లోనూ దళారులే వడ్లు కొంటున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధన కంటే రూ.200 వరకు తక్కువ చెల్లిస్తున్నారు. దళారులు వడ్లు కొనడంపై నిర్వాహకులు అధికారులకు ఫిర్యాదు చేయగా.. విచారణ కోసం వచ్చిన అధికారులపై రైతులు తిరగబడుతున్నారు. కేంద్రాల్లో వేగంగా తూకం వేస్తే మేమెందుకు దళారులకు వడ్లు అమ్ముకుంటామని ఎదురు ప్రశ్నిస్తున్నారు. మీరు కొనరు.. కొనే వారిని వెళ్లగొడతారా అని నిలదీస్తున్నారు. మూడు రోజుల క్రితం కూడా అప్పాజీపల్లిలో దళారుల దందాపై విచారణ చేస్తున్న అధికారులకు ఇలాగే చేదు అనుభవం ఎదురైంది. అప్పులకు మిత్తి మీద పడుతుండడంతో చేసేదేమీ లేక వ్యాపారులకు వడ్లు అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

'పది'విద్యార్థులపై శ్రద్ధ తీసుకోండి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో పదో తరగతి ఉత్తమ ఫలితాల సాధన, సమగ్ర శిక్షా కార్యక్రమాలు, సర్వీస్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ పది ఫలితాల్లో గతేడాది కంటే ఈసారి మెరుగుపడాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని, ముందస్తు అనుమతి తీసుకొని సెలవు పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ ప్రకారం ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం సర్వీస్ రూల్స్‌పై గజిటెడ్ హెచ్‌ఎం నాగభూషణం, ఎస్‌వోపీపై జీసీఈవో మాధవి, న్యాస్‌పై ఏఎంవో అనురాధ, సీఎంవో వెంకటేశం గ్రాంట్స్‌పై అవగాహన కల్పించారు.

విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు


కొండాపూర్: గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తున్న అధికారులు


తూప్రాన్ గురుకులంలో తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో

కొండాపూర్/హత్నూర/నారాయణఖేడ్/జహీరాబాద్/ రేగోడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాలు, విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం ఇతర సౌకర్యాలను పరిశీలించేందుకు మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వంటగదులు, పరిసరాల్లో పరిశుభ్రతను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ అధికారి డీపీవో వెంకటలక్ష్మి మంగళవారం పరిశీలించారు. హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం వండి పెట్టిన అన్నం, కూరగాయలను జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేయగా, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఆర్డీవో అశోక చక్రవర్తి స్థానిక తహసీల్దార్ భాస్కర్‌తోకలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి శివారులో గల మైనార్టీ గురుకుల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. మెదక్ జిల్లా రేగోడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా మత్స్య శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి మల్లేశం ఆకస్మిక తనిఖీ చేశారు. భవనం మరమ్మతులు సరిగా జరగడం లేదని పనులు వేగంగా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారావమ్మ, తహసీల్దార్ నరేష్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి స్వయంప్రభ ఉన్నారు.

మార్గదర్శకాలు పాటించాలి

తూప్రాన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. తూప్రాన్ మండల వనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో సత్యనారాయణ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను, జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.

ఊరూరా పనుల జాతర


నందిగామలో అభివృద్ధిపనులను ప్రారంభిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే

పటాన్‌చెరు రూరల్/మునిపల్లి/కంగ్టి/మనూరు/నాగల్‌గిద్ద/కొండాపూర్, నవంబరు 26 : ప్రజాపాలన ప్రారంభించి ఏడాదికాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో చేపట్టిన పనుల జాతర కార్యక్రమం మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ నుంచి బానూరు వరకు రూ. కోటి అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మునిపల్లి మండలకేంద్రంతో పాటు బుదేరా, ఖమ్మంపల్లి, కంకోల్ తదితరగ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఏపీడీ పూజ, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు ప్రారంభించారు. కంగ్టి మండలపరిధిలోని కంగ్టి, దెగుల్‌వాడి, తుర్కవడగాం, రాజారం తండాతదితర గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, డీఎల్‌పీవో సంజీవ్‌రావు, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో నజీంఖాన్, తదితరులు ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. మనూరు మండలంలో ఎంపీడీవో అలివేలి మంగ ప్రారంభించారు పలు గ్రామాల్లో జాతీయ జెండాను ఎగురవేసి, ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. నాగల్‌గిద్ద మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు నాయకులు జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభించారు. కొండాపూర్ మండలంలోని మన్మాదాపూర్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై ఉపాధిహామీ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు.

● నర్సాపూర్/తూప్రాన్/చేగుంట/అల్లాదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంటలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మన ఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. తూప్రాన్ మండలంలో ఎంపీడీవో శేషాద్రి, చేగుంట మండలంలో మండల నోడల్ ఆఫీసర్ యాదయ్య ఆధ్వర్యంలో ఊరూరా ఉపాధి హామీ పథకం కింద పశువుల పాకలు, అజోలా నిర్మాణాలు, నాడెపు కంపోస్టు పిట్స్, నీటి నిలువ గుంతలు తదితర పనులను ప్రారంభించారు. గుండ్రెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. అల్లాదుర్గం మండలంలో వననర్సరీలను ఏర్పాటు చేసి ప్రారంభించారు.